# కేసీఆర్ పథకాలే బీఆర్‌ఎస్‌కు శ్రీరామరక్ష



మాజీ ఎమ్మెల్యే దివంగత పొన్నమనేని నారాయణరావు మనుమడు శ్రీధర్‌రావుకు శాలువా కప్పి సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నేతలు శ్రీనివాస్, రవీందర్‌రావు తదితరులు

- ప్రజా సంక్షేమానికి పాటుపడే బీఆర్‌ఎస్‌కు అన్ని వర్గాలు అండగా ఉండాలి
- ‘దళిత బంధు’పై విమర్శలు సరికాదు
- బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 2: బీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీ అభ్యర్థుల గెలుపునకు శ్రీరామరక్ష అని బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం సిటీ సెంటర్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఎక్కడలేని అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల గుండెల్లో సుస్థిరంగా నిలిచిపోయిందన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుస్తుందని, కేసీఆర్ మూడో సారి సీఎం కావడం ఖాయమని ప్రజలందరిలో నమ్మకం పెరిగిందన్నారు. బీఆర్‌ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి కౌశిక్‌రెడ్డిని మొదలుపెట్టిన ప్రచారంలో ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందన చూస్తే తెలంగాణ రాష్ట్రంలోనే మొట్ట మొదటగా పార్టీ గెలిచే సీటు ఇదే కానున్నదని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ నాయకులు అన్నట్లుగా మూడు గంటల కరెంట్ కావాలా?, బీఆర్‌ఎస్ సర్కారుతో 3 పంటలు కావాలా? ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు పంటలకు సాగు, ప్రజలకు తాగునీరు, 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. కాంగ్రెస్, పాలనలో తెలంగాణ ప్రజలు అరిగోస పడ్డారని, దానిని నేటికీ మర్చిపోలేరని, అందుకే అన్ని వర్గాలు బీఆర్‌ఎస్ వైపు నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు దళితుల కోసం ఎలాంటి ప్రత్యేక స్కీమ్‌లు అమలు చేయకపోగా, దళిత బంధు పథకంతో దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం కేసీఆర్‌ను కొందరు ప్రతిపక్ష దళిత నేతలు విమర్శించడం సరికాదన్నారు. ఎస్సీ వర్గీకరణకు సీఎం కేసీఆర్ గతంలోనే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారని, కావాలని కొందరు బీఆర్‌ఎస్‌ను టార్గెట్ చేసి విమర్శించడం సరికాదన్నారు. బీజేపీ ప్రభుత్వం ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి అమలు చేయాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ లాంటి సంక్షేమ పథకాలు అమలు చేసి అప్పుడు ఇక్కడి ప్రజలను ఓట్లు అడగాలని శ్రీనివాస్ ప్రతిపక్షాల నాయకులకు సూచించారు.

**మాజీ ఎమ్మెల్యే మనుమడికి సత్కారం..**

హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే దివంగత పొన్నమనేని నారాయణరావు మనుమడు పొన్నమనేని శ్రీధర్‌రావు పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయానికి మొదటిసారిగా రాగా, ఆయనకు గులాబీ కండువా, శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి గెలుపునకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా శ్రీధర్‌రావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వర్ధినేని రవీందర్‌రావు, మండలాధ్యక్షుడు సంగెం ఐలయ్య, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి తులసి లక్ష్మణమూర్తి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు మొలుగురి ప్రభాకర్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బీఎస్ ఇమ్రాన్, ఒంటెల రాజిరెడ్డి, బత్తుల సమ్మయ్య, గంట రమేశ్, కొలిపాక సమ్మయ్య, గంట కొమురయ్య, నిరంజన్ రెడ్డి, గంట శంకర్, పోచంపల్లి సదయ్య, ఇల్లందుల శ్రీనివాస్, వెంకటేశ్ గౌడ్, అన్నయ్య లింగం, వాసు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో సీసీఐ కొనుగోళ్లకు సిద్ధం

- నాణ్యతా ప్రమాణాలతో పత్తిని తేవాలి
- మద్దతు ధరలకు కాటన్ అమ్ముకోవాలి
- రైతులను ఇబ్బంది పెట్టే చర్యలను సహించం
- డీఎంవో పద్మావతి.. జమ్మికుంటలో సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ధాన్యం తూకం వేస్తున్న డీఎంవో పద్మావతి తదితరులు

జమ్మికుంట, నవంబర్ 2: ప్రభుత్వ మద్దతు ధరలతో జిల్లాలోని మార్కెట్లలో సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)ఆధ్వర్యంలో కొనుగోళ్లకు సిద్ధమయ్యామని, రైతులు తమ పత్తిని నాణ్యతా ప్రమాణాలతో మార్కెట్‌కు తీసుకురావాలని జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి పద్మావతి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని కాటన్ మార్కెట్‌కు ఆమె వచ్చారు. సీసీఐ జమ్మికుంట ఇన్‌చార్జి చంద్రశేఖర్, జమ్మికుంట కార్యదర్శి జీ రెడ్డినాయక్‌తో కలిసి యార్డులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వావిలాల గ్రామానికి చెందిన రైతు సంపత్, మామిడాలపల్లి గ్రామ రైతు కుమార్‌కు చెందిన పత్తిని సీసీఐ కొనుగోలుతో బోణీ చేసింది. కొనుగోళ్లను డీఎంవో పరిశీలించారు. తర్వాత ఆమె మాట్లాడుతూ.. 2023–24 సంవత్సరంలో సీజన్‌కు పత్తి పంటకు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7020 ప్రకటించిందని తెలిపారు. జిల్లాలో కరీంనగర్, జమ్మికుంట, చొప్పదండి, గోపాల్‌రావుపేటలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని, జమ్మికుంటలో 6, కరీంనగర్‌లో 3, చొప్పదండిలో 1, గోపాల్‌రావుపేటలో 1.. 11 పత్తి మిల్లుల్లో కొనుగోళ్లు సాగుతాయని వెల్లడించారు. పత్తి పింజ పొడవు, పొట్టి, తేమ శాతం ప్రకారం ధరలుంటాయని పేర్కొన్నారు. 12శాతం తేమ దాటిన కాటన్‌ను సీసీఐ కొనుగోలు చేయదని తెలిపారు. సీసీఐకి అమ్ముకునే రైతులు ఆధార్ కార్డుకు బ్యాంకు అకౌంట్‌కు, ఫోన్ నంబర్‌కు లింకు చేసుకుని ఉండాలన్నారు. పత్తిని 9గంటల్లోపు మార్కెట్ యార్డుకు తేవాలని, నీళ్లు చల్లుకొని తేవద్దని సూచించారు. కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టే చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. ఇక్కడ మార్కెట్ అధికారులు యాకయ్య, లక్ష్మణ్, బాబా, ట్రేడర్లు, అడ్తిదారులు, హమాలీలు, గుమస్తాలు, రైతులు, సిబ్బంది ఉన్నారు.

**ప్రతి గింజా కొనుగోలు చేస్తాం**

ప్రభుత్వ మద్దతు ధరలతో ప్రతి గింజా కొనుగోలు చేస్తామని జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి పద్మావతి అన్నారు. జమ్మికుంట పాత వ్యవసాయ మార్కెట్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, గురువారం పీఏసీఎస్ కార్యదర్శి రవీందర్, మార్కెట్ కార్యదర్శి జీ రెడ్డినాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర గ్రేడ్‘ఏ’రకానికి రూ.2203, కామన్ రకానికి రూ.2183గా ప్రకటించిందని, మార్కెట్‌లోనే ధాన్యాన్ని రైతులు విక్రయించాలని కోరారు. దళారులను ఆశ్రయిస్తే మోసపోతారని చెప్పారు. 17శాతం తేమ ఉండేలా చూసుకోవాలని, అలాగే.. చెత్త, తాలు, మట్టి పెళ్లలు, రాళ్లు, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం తేవద్దని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. వరి కోత వెంటనే ధాన్యం మార్కెట్‌కు తేవద్దని, శుభ్ర పరిచిన తర్వాత ఆరబెట్టిన ధాన్యాన్ని మాత్రమే తీసుకురావాలని చెప్పారు. ధాన్యంతో పాటు రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లను సిబ్బందికి అప్పగించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లోనే డబ్బులు రైతు ఖాతాలో జమ చేస్తారని చెప్పారు. ఇక్కడ మార్కెట్ అధికారులు, పీఏసీఎస్ అధికారులు యాకయ్య, లక్ష్మణ్, రవీందర్, తిరుపతి, దేవేందర్, అనిల్, లక్ష్మణ్, శ్రీనివాస్, సిబ్బంది, రైతులున్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం వితరణ

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 2: బీఆర్‌ఎస్ కార్యకర్త, రజక సంఘం నాయకుడు నల్ల మొండయ్య ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబానికి సామాజిక కార్యకర్తలు, బీఆర్‌ఎస్ నాయకులు పొన్నమనేని శ్రీధర్‌రావు, వర్ధినేని రవీందర్‌రావు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ సమక్షంలో 100 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఒంటెల రాజిరెడ్డి, బత్తుల సమ్మయ్య, ఎండీ ఇమ్రాన్, క్యాస ఉపేందర్, మొలుగూరి ప్రభాకర్, కొండపాక శ్రీనివాస్, నల్ల బాలరాజు, తులసి లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల తనిఖీలో నగదు పట్టివేత

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 2: మున్సిపల్ పరిధిలోని పరకాల క్రాస్ రోడ్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీల్లో ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.లక్షా 20వేల 500 నగదును పట్టుకున్నట్లు ఏసీపీ లక్కిరెడ్డి జీవన్‌రెడ్డి తెలిపారు. హనుమకొండకు చెందిన తీగల వెంకటేశ్ అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా సదరు నగదును తీసుకువెళ్తుండగా, పట్టుకొని సీజ్ చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో హుజూరాబాద్ టౌన్, రూరల్ సీఐలు బొల్లం రమేశ్, బీ సంతోష్‌కుమార్, ఎస్సై సాంబయ్య, ఎన్నికల ప్రత్యేకాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరిక



వల్భాపూర్‌లో ఎల్క దేవేందర్‌రెడ్డికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, నవంబర్ 2: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి బీఆర్‌ఎస్ పార్టీలోకి వస్తున్నారని పార్టీ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మండలంలోని వల్భాపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారం అనంతరం గ్రామానికి చెందిన రెడ్డిసంఘం గ్రామాధ్యక్షుడు ఎలక్క దేవాల్‌రెడ్డి, మరో 50 మంది బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి పాడి కౌశిక్‌రెడ్డి గులాబీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని, బీఆర్‌ఎస్ పార్టీకి అండగా నిలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యకర్తలే పార్టీకి బలం, బలగమని, ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని, హుజూరాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేయడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక–తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల–సాధవరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రఘుపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కామిడి శ్రీనివాస్‌రెడ్డి, బండారి వెంకటరాజం, పోరెడ్డి, తిరుపతిరెడ్డి, అందె కుమార్, జీడి తిరుపతి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 2: ఎన్నికల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హుజూరాబాద్ రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు అన్నారు. గురువారం పట్టణ శివారులోని కేసీ క్యాంపులో ఆయన మాట్లాడుతూ, ఈ నెల మూడో తేదీ నుంచి పదో తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు తెలిపారు. పోటీ చేసే అభ్యర్థుల సౌకర్యం కోసం వివరాలు తెలుసుకోవడానికి ఆర్డీవో కార్యాలయంలో ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నామినేషన్ ఫారాలు తీసుకోవడం మొదలు, దాఖలు వరకు పాటించాల్సిన అన్ని అంశాలను వివరించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో 2,44,514 ఓటర్లు (పురుషులు 1,19,676, మహిళలు 1, 24,833, ట్రాన్స్ జెండర్లు ఐదుగురు) ఉన్నారని వెల్లడించారు. మొత్తం 305 పోలింగ్ స్టేషన్‌లు ఉండగా, ఇందులో 82 గ్రామాలు అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు తెలిపారు. వీటిలో ఎన్నికలు జరిగే సమయంలో 153 వెబ్ కెమెరాలను అమర్చినట్లు చెప్పారు. ఇప్పటివరకు మొత్తం 732 మందికి ఎన్నికల నిర్వహణ కోసం శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఓటరుగా నమోదై ఓటర్ కార్డు లేని వారికి ఓటర్ ఇన్ఫర్‌మేషన్ స్లిప్పులు అందించనున్నట్లు చెప్పారు. సమావేశంలో సహాయ ఎన్నికల అధికారులు కే విజయ్‌కుమార్, మాధవి పాల్గొన్నారు.

## టీఎస్ టీడీసీ చైర్మన్ వాహనం తనిఖీ



గెల్లు శ్రీనివాస్‌యాదవ్ వాహనాన్ని తనిఖీ చేస్తున్న చెక్‌పోస్ట్ పోలీసులు, ఎన్నికల సిబ్బంది

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 2: హుజూరాబాద్ నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వెళ్తున్న రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ వాహనాన్ని పట్టణ శివారులోని పరకాల క్రాస్‌రోడ్ చెక్ పోస్ట్ వద్ద ఎన్నికల సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహన తనిఖీ అధికారులకు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ పూర్తిగా సహకరించారు.

## ‘ప్రజాగర్జన’ను విజయవంతం చేయాలి

జమ్మికుంట, నవంబర్ 2: తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో రేపు నిర్వహించబోయే ఉమ్మడి జిల్లా ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాచపల్లి సాగర్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం ఆయన జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రజాగర్జన సభకు భారీ సంఖ్యలో అన్ని వర్గాల ప్రజలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని, దేశంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని, మోదీ, అమిత్‌షాల వైఖరిపై మండిపడ్డారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించిన కేంద్రం, కులాల వారీగా వాటా తేల్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పోడేటి వేణు, కార్యదర్శి సలిగంటి సతీశ్, జమ్మికుంట టౌన్ అధ్యక్షుడు వడ్లూరి అరుణ్, మండల నాయకుడు మొలుగూరి రాజేందర్, తదితరులున్నారు.